## • గిరిజనులకు తప్పని తాగునీటికష్టాలు



వానకాలంలోనూ గిరిజనులకు నీటి కష్టాలు తప్పలేదు. పది హేను రోజులుగా మిషన్ భగీరథ నీరు రాక సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం మెడుకుంద్యా తండాలోని గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కిలో మీటరు దూరంలోని చెరువు నుంచి తాగేందుకు నీటిని తెచ్చుకుంటున్నారు. చెరువు నీటిని వాడటం వల్ల పిల్లలకు వాంతులు, విరేచనాలు, విషజ్వరాలు సోకుతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు.

– వట్‌పల్లి

## • పట్టాల మధ్యలో మృత్యుంజయురాలు



వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలోని ఓ తండాకు చెందిన గిరిజన మహిళ ఆదివారం సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్నది. నవంద్గి (బషీరాబాద్) రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా.. వేగంగా గూడ్స్ రైలు దూసుకొచ్చింది. దీంతో గమనించిన ఆమె ధైర్యం చేసి పట్టాల మధ్యలో పడుకున్నది. రైలు వెళ్లిపోయాక పైకి లేచింది. దీంతో అక్కడ ఉన్న వారు ఆమె ధైర్యాన్ని మెచ్చుకున్నారు.

– బషీరాబాద్



మాట్లాడుతున్న బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు

## మధ్యాహ్న భోజన కార్మికుల వేతనం పెంచాలి

**బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు**

చిక్కడపల్లి, ఆగస్టు 25 : మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనం ఇవ్వాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.వెయ్యి వేతనం 3వేలకు పెంచారని గుర్తు చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో వంట కార్మికలకు 10వేలు ఇస్తామని మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్న రేవంత్‌రెడ్డి అమలుచేయకుండా మోసగించారని మండిపడ్డారు. ధర్నాకు మల్కాజిగిరి ఎంపీ ఈటల మద్దతు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు హన్మాండ్లుచారి, ప్రధాన కార్యదర్శి బాబాయి, భా రతి, సంతోష, మంజుల, శేషన్న పాల్గొన్నారు.

## • మున్నూరుకాపుల మౌనదీక్ష



మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి జనాభా ప్రతిపాదికన తమకు అన్ని రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని మున్నూరు కాపు కులస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలకేంద్రంలోని మున్నూరుకాపు సంఘ భవనంలో ఆదివారం మౌనదీక్ష చేపట్టారు.

– మద్నూర్

## డెంగ్యూతో యువకుడి మృతి

**విషజ్వరంతో చిన్నారి..**

రామారెడ్డి/కొత్తగూడ, ఆగస్టు 25: రాష్ట్రంలో డెంగ్యూ, విషజ్వరాల బారిన పడి ప్రజలు ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. ఆదివారం డెంగ్యూతో యువకుడు, విషజ్వరంతో చిన్నారి మృతిచెందారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌కు చెందిన చిలుక నరేశ్(28) ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అతడికి మూడ్రోజుల క్రితం జ్వరం రావడంతో కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్చారు. పరిస్థితి విషమించగా హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం హనుమాన్‌తండాకు చెందిన భూక్యా రాజేందర్-సంధ్య దంపతుల కూతురు రూప(18 నెలలు)కు ఐదురోజుల క్రితం జ్వరం రావడంతో నర్సంపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మృతి చెందింది.

## అమెరికాలో సూర్యాపేట జిల్లా వాసి మృతి

సూర్యాపేట, ఆగస్టు 25(ఆత్మకూర్.ఎస్) : సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం పాతర్లపహాడ్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ (39) అమెరికాలోని స్విమ్మింగ్‌పూల్‌లో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ప్రవీణ్ ఐదేండ్ల క్రితం టీచర్‌గా అమెరికా వెళ్లాడు. భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం 8 గంటలకు ప్రవీణ్‌కుమార్ సమీపంలోని స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో మునిగి మృతి చెందినట్టు అతడి భార్య కుటుంబ సభ్యులకు తెలిపింది.

## నల్లగొండ దవాఖానలో మరో దారుణం

- డాక్టర్ల నిర్లక్ష్యంతో ప్రసవంలోనే శిశువు మృతి!
- ప్రైవేట్‌కు తరలిస్తుండగా అడ్డగించి ప్రసవం చేసిన వైద్యులు
- డాక్టర్లు, నర్సుల నిర్లక్ష్యమేనంటూ బాధితుల ఆందోళన
- కుర్చీలో గర్భిణి ప్రసవం ఘటన మరువక ముందే..



మీడియాతో మాట్లాడుతున్న బాధితురాలు శ్రీలత భర్త రాజు

రామగిరి, ఆగస్టు 25 : నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో మరో దారుణ ఘటన చోటుచేసుకున్నది. కుర్చీలో గర్భిణి ప్రసవం జరిగిన విషయం మరువకముందే వైద్యులు, సిబ్బంది నిర్వాకంతో మరో మహిళ గర్భంలోనే శిశువు మృతిచెందింది. శ్రీలత భర్త రాజు మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలం గారకుంట పాలేనికి చెందిన చెరుకుపల్లి శ్రీలతను ప్రసవం కోసం కుటుంబ సభ్యులు శుక్రవారం నల్లగొండలోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తీసుకొచ్చారు. శనివారం సాయంత్రం 6 గంటల వరకు వైద్యులు పట్టించుకోకపోవడంతో ఆందోళన చెందిన బాధితులు ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్తుండగా సిబ్బంది, డ్యూటీ డాక్టర్ అడ్డగించారు. హడావిడిగా రాత్రి ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి ఆపరేషన్ చేస్తుండగానే మగ శిశువు గర్భంలోనే మృతిచెందింది. సకాలంలో వైద్యం అందకపోవడంతోనే శిశువు చనిపోయినట్టు బాధితులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. శిశువు శరీరంపై గాయాలున్నాయని, వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందినట్టు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. గురువారం ఇదే దవాఖానలో 'కుర్చీలోనే ప్రసవం' ఘటనకు సంబంధించి అదనపు కలెక్టర్ పూర్ణచందర్ సంబంధిత డాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దాంతో శనివారం డాక్టర్లు మూకుమ్మడిగా సెలవులు పెట్టడంతో వైద్య సేవలు కొనసాగలేదు. ఈ క్రమంలోనే శ్రీలత మాతాశిశు సంరక్షణ కేంద్రానికి రావడం.. సరైన సమయంలో వైద్యం అందక పోవడం, ఆపరేషన్ చేస్తున్న క్రమంలో శిశువు మృతి చెందడంతో ఈ దవాఖాన పేరు మరోమారు చర్చల్లోకి ఎక్కింది. రాత్రి నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, దవాఖాన ఎదుట ధర్నాకు దిగారు.

## బాలికపై బాలుడి లైంగికదాడి

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 25 : 16 ఏండ్ల బాలుడు.. 13ఏండ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన కుమ్రంభీం జిల్లా కేంద్రంలో ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. డీఎస్పీ సదయ్య కథనం ప్రకారం.. ఆసిఫాబాద్‌కు చెందిన ఓ బాలుడు మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో ఓ బాలికతో స్నేహం చేసి ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. ఇటీవల వీడియోకాల్ చేసి నగ్నంగా కన్పిస్తూ మాట్లాడాలని కోరాడు. మొదట ఒప్పుకోని ఆ బాలిక తర్వాత అంగీకరించింది. ఆమె ఫోన్‌లో నగ్నంగా కన్పించగా స్క్రీన్ షాట్స్ తీశాడు. తరువాత ఆ ఫొటోలు చూపించి బ్లాక్‌మెయిల్ చేసి లైంగికదాడి చేశాడు. విషయం తెలుసుకున్న బాలిక తండ్రి 23న పోలీసులకు ఫిర్యాదు చేయగా, అతడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, ఇన్‌చార్జి జువెనైల్ జస్టిస్ బోర్డు ఆసిఫాబాద్ కోర్టు ఎదుట హాజరుపర్చారు.

- దరఖాస్తుల స్వీకరణతో మరింత జాప్యం
- ఆందోళనలో అశ్వారావుపేట నియోజకవర్గ రైతాంగం
- రుణమాఫీపై ఇంకా తొలగని గందరగోళం
- 'పేట' గ్రీవెన్స్‌లో 2,029 ఫిర్యాదులు

# రుణమాఫీ చెల్లింపుల్లో.. సర్కారు కాలయాపన

అశ్వారావుపేట, ఆగస్టు 25: రుణమాఫీ అమలులో కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కొందరికి అరకొరగా మాఫీ చేస్తున్న ప్రభుత్వం.. సాంకేతిక కారణాలను చూపిస్తూ అనేకమందికి ఎగనామం పెడుతోంది. రుణమాఫీ కావాలంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటూ మెలికపెడుతోంది. దీంతో రుణమాఫీ ప్రక్రియలో మరింత జాప్యం జరుగుతోంది. దీంతో నియోజకవర్గ రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. దీనికితోడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కాలయాపన చేస్తోందని రైతులు స్పష్టం చేస్తున్నారు. అయితే రుణమాఫీ కచ్చితంగా అమలవుతుందంటూ అటు అధికార యంత్రాంగం, ఇటు ప్రభుత్వం తమను మభ్యపెడుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మూడు దఫాల్లో రుణమాఫీ చేపట్టినా అర్హుల నుంచి భారీగా ఫిర్యాదులు అందుతున్నాయి. రుణమాఫీ చెల్లింపుల్లో కాంగ్రెస్ సర్కారు వద్ద కచ్చితమైన కార్యాచరణ లేదని రైతులు గందరగోళానికి గురవుతున్నారు.

**మూడు విడతలు పూర్తయినా..**

బీఆర్ఎస్ నేతల డిమాండ్‌తో రుణమాఫీ తేదీని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆగస్టు 15లోపు ఏకకాలంలో రైతు రుణాల మాఫీ ప్రక్రియ పూర్తవుతుందని చెప్పుకొచ్చారు. కానీ విడతల వారీగా మాఫీ ప్రక్రియకు ఆయన ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మూడు విడతల్లో రుణమాఫీని అమలు చేసింది. మొదటి విడతలో రూ.లక్షలోపు, రెండో విడతలో రూ.1.50 లక్షల్లోపు, మూడో విడతలో రూ.2 లక్షల్లోపు రుణాలను మాఫీ చేసినట్లు ప్రభుత్వం చెబుతోంది. నాలుగో విడతలో రూ.2 లక్షల పైన ఉన్న రైతులకు మాఫీ చేస్తామంటూనే ఆ పైన ఉన్న రుణ మొత్తాన్ని రైతులు ముందుగా చెల్లించాల్సి ఉంటుందని నిబంధన పెట్టింది. కానీ ఇందుకు ఇంకా స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయలేదు. పంట రుణాలు తీసుకున్న రైతులకు ఏ విడతలోనూ పూర్తిస్థాయిలో మాఫీ కాలేదు. ప్రతి గ్రామంలోనూ అర్హులైన రైతుల నుంచి ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది.



గ్రీవెన్స్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయాధికారులు

**రైతుల్లో గందరగోళం..**

రుణమాఫీ అమల్లో మొదట విడత నుంచే రైతుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. బ్యాంకుల నుంచి రుణమాఫీ జాబితా సేకరించిన కాంగ్రెస్ సర్కార్.. అనేక నిబంధనలతో అర్హులైన రైతుల రుణాలు మాఫీ చేయలేదు. అందుకు సాంకేతిక కారణాలను సాకుగా చూపుతోంది. రేషన్ కార్డు ప్రామాణికం కాదంటూనే దానినే ప్రామాణికంగా తీసుకుంది. భూములను విభజించుకున్న రైతు కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు అందక ఎక్కువమంది రైతులు అర్హత కోల్పోయారు. ఈ నేపథ్యంలో కొద్దిమందికే రుణమాఫీ అమలు చేయడంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటోంది. రైతులు కూడా ఎక్కడికక్కడ ఆందోళనలు చేపడుతున్నారు. రైతుల ఆందోళనలకు బీఆర్ఎస్ అండగా నిలవడంతో గత్యంతరంలేక రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు గ్రీవెన్స్ కార్యక్రమాన్ని చేపట్టింది. అర్హులైన రైతుల నుంచి మళ్లీ దరఖాస్తుల స్వీకరించేందుకు ఏవోలు, ఏఈవోలకు బాధ్యతలు అప్పటించింది. గత బుధవారం నుంచి దరఖాస్తులు అందించేందుకు రైతులు వ్యవసాయ కార్యాలయాలు, రైతు వేదికల చుట్టూ తిరుగుతున్నారు. ఈ తతంగమంతా రుణమాఫీ అమలును కాలయాపన చేసేందుకే అనే ఆవేదన అన్నదాతల్లో కనిపిస్తోంది. అయినా రుణమాఫీ అయ్యే వరకు రేవంత్‌రెడ్డి సర్కార్‌ను వదిలిపెట్టేది లేదని వారు స్పష్టం చేస్తున్నారు.

**రైతుల నుంచి 2,029 ఫిర్యాదులు..**

అర్హత ఉన్నప్పటికీ రుణమాఫీ చేయకపోవడంతో ఎక్కువమంది రైతులు నష్టపోయారు. ప్రభుత్వం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో రైతులు భారీ సంఖ్యలో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. గడిచిన ఐదు రోజుల్లోనే అశ్వారావుపేట నియోజకవర్గంలోని మండలాల నుంచి 2,029 మంది రైతులు రుణమాఫీ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అశ్వారావుపేట మండలం నుంచి 425, దమ్మపేట నుంచి 268, ములకలపల్లి నుంచి 381, చంద్రుగొండ నుంచి 543, అన్నపురెడ్డిపల్లి మండలం నుంచి 412 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు.

**షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి..**



ఎటువంటి షరతులూ లేకుండా ప్రతి రైతుకూ ప్రభుత్వం రుణమాఫీ అమలు చేయాలి. రూ.2 లక్షల్లోపు రుణాలు చాలా మందికి మాఫీ కాలేదు. సాంకేతిక కారణాలను సాకుగా చూపడం సరికాదు. రూ.2 లక్షల పైన ఉన్న రైతులకు కూడా మాఫీ అమలు చేయాలి. పైన ఉన్న రుణం రైతులు చెల్లించుకుంటారు. ముందు రైతులను చెల్లించాలనడం కూడా కరెక్ట్ కాదు. ఒకవేళ రైతు రూ.2 లక్షల పైన ఉన్న రుణం చెల్లించిన తర్వాత రుణమాఫీ కాకుంటే బాధ్యులెవరు?

**–మిర్యాల కృష్ణ, రైతు, మల్లిగూడెం, అన్నపురెడ్డిపల్లి**

**అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం..**



రుణమాఫీకి అర్హత ఉండి ఇంకా మాఫీ కాని రైతుల నుంచి ప్రభుత్వ ఆదేశానుసారం దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఈ వివరాలను జిల్లా ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తాం. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొందరు రైతులకు రుణమాఫీ కాలేదు. ఈ విషయాన్ని ప్రభుత్వం కూడా ప్రకటించింది. గ్రీవెన్స్‌లో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించిన తర్వాత ప్రభుత్వం రుణమాఫీ చేస్తుంది. దరఖాస్తుల స్వీకరణకు ప్రస్తుతం ఎటువంటి గడువూ లేదు.

**–వినయ్, మండల వ్యవసాయాకారి, చంద్రుగొండ**

# పోలీస్ సబ్ డివిజన్ కేంద్రంగా మధిర?

మధిర, ఆగస్టు 25 : మధిరలో పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు కోసం జిల్లా పోలీసు ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. దీంతో మధిర నియోజకవర్గ పరిధిలోని పోలీస్‌స్టేషలన్నీ మధిర డివిజన్ పరిధిలోకి తీసుకొచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో మధిర నియోజకవర్గంలోని మధిర, ఎర్రుపాలెం, బోనకల్లు, మధిరరూరల్ మధిర సర్కిల్ పరిధిలో ఉండేవి. అదేవిధంగా చింతకాని వైరా సర్కిల్ లోను, ముదిగొండ ఖమ్మం రూరల్ సర్కిల్‌లో పోలీస్‌స్టేషన్లు ఉండేవి. ప్రస్తుతం ఈ మండలాలకు సంబంధించిన పోలీస్‌స్టేషన్లు అన్ని మధిర సబ్ డివిజన్ పరిధిలోకి తీసుకురానున్నారు. మధిర నియోజకవర్గంలోని బోనకల్లు, ఎర్రుపాలెం, మధిర, మధిరరూరల్, చింతకాని పోలీస్‌స్టేషన్లు వైరా సబ్‌డివిజన్ పరిధిలో ఉండేవి. ముదిగొండ మాత్రం ఖమ్మంరూరల్ సబ్‌డివిజన్ పరిధిలో వ్యవహరిస్తూ విధులు నిర్వహించేవారు. ఇప్పుడు ఈ స్టేషన్లన్నీ మధిర డివిజన్ పరిధిలోకి రానున్నాయి. అదే విధంగా కొత్తగా డివిజన్ పరిధిలో ఏర్పడితే మధిర డివిజన్‌లోని టౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వోగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను, అదేవిధంగా బోనకల్లు పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వోగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను, ముదిగొండకు ఎస్‌హెచ్‌వోగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను ఏర్పాటు చేసేందుకు పోలీసు ఉన్నతాధికారులకు అధికారికంగా నియమించేందుకు ఆదేశాలు జారీ చేయబోతున్నారు. ఇప్పటికే ముదిగొండ పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వో పోస్టును పోలీసు ఉన్నతాధికారులు నియమించారు. మధిర సర్కిల్ పరిధిలో మధిరరూరల్, ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్లతోపాటు, బోనకల్లు సర్కిల్ పరిధిలోని చింతకాని ఉండబోతుందని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈ విధంగా ఏర్పడితే నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు ప్రజారక్షణకు మరింత పోలీసు వ్యవస్థ అందుబాటులో ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. త్వరలోనే మధిర నియోజకవర్గ కేంద్రంగా కొత్తగా ఏసీపీ పోస్టును మంజూరు చేసి ప్రజలకు పోలీసు వ్యవస్థ మరింత పటిష్టంగా మారనుంది. సంబంధిత నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్లు చర్చ జరుగుతున్నది.

## ఇల్లెందు సహకార సంఘం మాజీ కార్యదర్శి రిమాండ్

ఇల్లెందు రూరల్, ఆగస్టు 25: ఇల్లెందు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) మాజీ కార్యదర్శి హరిప్రసాద్‌ను ఇల్లెందు సబ్‌జైలుకు రిమాండ్ చేస్తూ భద్రాచలం న్యాయస్థానం ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. ఇల్లెందు సహకారం సంఘంలో 70 యూరియా బస్తాల అక్రమాలపై అధికారులు ఆయనను సస్పెండ్ చేసిన విషయం విదితమే. విచారణలో భాగంగా పోలీసులు అతడిని భద్రాచలం న్యాయస్థానంలో హాజరుపరిచారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి.. ఇల్లెందు సబ్ జైలుకు రిమాండ్ చేశారు.


